వారం వారం కథాప్రభ

**రోజులుగా ... చాలా రోజులుగా మీరాబాయి ఆలోచిస్తూనే ఉంది. బాధపడుతూనే ఉంది. ఈ ఆలోచించడం, బాధపడడం అనే అలవాటు హఠాత్తుగా మొదలయ్యిందా, లేక మనసులోని ఏదో చెప్పలేని తపన ఈ విధంగా ఆవిడను ఆలోచనలకు ఉసిగొల్పి ఏకాకితనంవైపు నెట్టుతోందా అన్నది ఆమెకే తెలియని విషయం.**

చాలామంది మన మేథే మనలోని అమాయకత్వంతో తెలిసీ తెలియనితనంతో, చేతకానితనంతో చెలగాట మాడుతూ ఉంటుందని అంటారు. నిజమేనేమో! కానీ ఒకటి మాత్రం నిజం. మీరాబాయి ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నట్టు, అందుకోసం అమితంగా దిగులు పడ్డట్టుగా కనిపిస్తుంది. మనిషిని చూస్తే ఏదో వెలితి ఆమెను పీల్చి పిప్పి చేస్తోందనే అనిపిస్తుంది!




మీరాబాయిది పెద్ద ఇల్లు. ఆవిడకు ఏ లోటూ లేదు. ఉద్యోగాలు చేస్తూ భార్యా పిల్లలతో తమ తమ జీవితాల్లో సుఖంగా ఇమిడిపోయిన ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఏడాదికో, రెండేళ్లకో ఓసారి వచ్చి ఒకటి రెండు నెలలు ఉండి తిరిగి అమెరికా వెళ్లిపోతారు. వాళ్లతో వచ్చిన ఆనందం తిరిగి వాళ్లతో విమానం ఎక్కి వెళ్లిపోతుంది. అయినా ఆవిడ తన ధోరణిలోనే తను ఉంటుంది. అన్నీ ఉండడమే లోటు అని కానీ, ఏమీ లేకపోవడమే మేలు అని కానీ అలాంటి ఏ ప్రాపంచిక విషయాలకు ఆమె ప్రాధాన్యత ఇవ్వదు. పదిహేనేళ్ల క్రితం భర్త పోయాడు. ఆ వియోగం, ఆ ఏకాకితనం పిల్లల్ని పెంచుతూ మరిచిపోయింది. అవును, మనుషులమీద కాలం తన శక్తి యుక్తుల్నీ, చాకచక్యాన్నీ పరోక్షంగా చూపిస్తూనే ఉంటుందిట. అది అనాదిగా లెక్కలకు అందని వయసును మీద వేసుకుని ఏ అలుపూ సొలుపూ లేకుండా ముందుకు పోతూనే ఉంది. దానికి ఏ వేదనలూ పట్టవు.

శ్రీసుభా

# వరప్రసాదం

అలా అలా ఏవో, ఏవేవో ఆలోచనలు - అక్కరలేనివి, అంతూ పొంతూ లేనివి, ఎవరో కానీ సమాధానం చెప్పలేని ప్రశ్నలు - మీరాబాయికి వస్తూనే ఉంటాయి. ఏదో పెద్ద వెలితి తనలో అగాధమై పెరిగిపోతున్నట్టు అనిపిస్తూ ఉంటుంది. చుట్టూ ఉన్న ప్రపంచం తనకి ఎడమయినట్టో,

తను ఆ ప్రపంచానికి దూరంగా జరిగిపోతున్నట్టో అనిపిస్తుంది. బాధ శరీరమంతా గాయపరిచినట్టుగా ఉంటుంది. అనుకోకుండా కళ్లు కన్నీటికి ఆలవాల మవుతాయి. హృదయం బీడు పడినట్టయి అనుభూతులకు ఆమడదూరమై విలవిల్లాడుతున్నట్టుగా ఉంటుంది.

పెద్ద కొడుకు చంద్రం, "మాతో వచ్చేయి, అమ్మా, ఒక్కత్తివీ ఈ దేశంలో ఉండి ఏం చేస్తావ్?' ' అంటాడు.

"అమెరికాలో చేయవల్సిందేం ఉందంటావ్? నే నెక్కడ ఉన్నా ఒకటే!"

"మీరు మాకూ, మేం మీకూ ... కాదనవద్దు, అత్తయ్యా!" కోడలు లలిత అంది.


మీరాబాయి పేలవంగా నవ్వేస్తుంది. చిన్న కొడుకు ఆనంద్ అయితే ఈ విషయంలో పోట్లాట పెట్టుకుంటాడు. పైగా పక్కవాటాలో ఉండే ప్రాణ స్నేహితుడు రమేశ్‌నీ, అతని భార్య రాధనీ పిల్చుకు వచ్చి మధ్యవర్తులను చేస్తాడు. ఆ దంపతు లిద్దరూ అంత కుముందు చెప్పిందే మళ్లీ ప్రాధేయపూర్వకంగా చెప్తారు. దానికి తోడు లలిత రాధతో గొంతుకు కలుపుతుంది. లలితా, రాధా డిగ్రీ వరకూ కాలేజీ చదువుకున్నారు. చిన్నప్పటి స్నేహితులు కూడా.

"నా వల్ల కాదయ్యా, రమేశ్!"

"అవును, నిజమే, అమెరికాలో ఏం ఉందని ... ఒట్టి డబ్బు శోభా, రాజకీయ చతురతా తప్పించి? అక్కడ ఒకరోజు, కాదు ఓ గంట ఉండి ఆ గాలి పీలిస్తే తోటివాణ్ణి కాల్చుకు తినే కొత్త రోగాలు పుట్టుకొస్తాయి" అన్నాడు వేళాకోళంగా రమేశ్.

"అది తప్పు. మన కమ్యూనిస్టులకు - ముఖ్యంగా ఈ దేశంలో కమ్యూనిస్టులకు అమెరికాను ఆడిపోసుకోవడం ఒక ఫాషన్. ఒక దేశపు రాజకీయ ధోరణులనుబట్టి ఆ దేశ ప్రజల్ని అంచనా వేయడం తప్పు. నీకు తెలియదేమో ... ఈ వేళ అక్కడి యువత తమ దేశం కోసం కాకుండా తమ వ్యక్తిగత వికాసానికి కూడా తపన పడుతున్నారు. వాళ్ల దగ్గర నేర్చుకోవాల్సింది చాలా ఉంది!"' చంద్రం అన్నాడు.

"అదేం కాదు - అక్కడ అంతులేని అరాచకత్వం, దౌష్ట్యం ఉన్నాయి. మిగతా ప్రపంచానికి అమెరికా సైనిక సామగ్రి అమ్మి, యుద్ధ తంత్రం నేర్పి, తను గట్టుమీద కూర్చుని ఆ తమాషాలు టీవీలో చూస్తుంది. మిగతా ప్రపంచం ఇప్పటికైనా తెలివి తెచ్చుకుని ఒకటి





# వెలుగులు నింపే దీపావళి

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగ దీపావళి. దీపావళి అంటే దీపాల వరుస అని అర్థం. శ్రీకృష్ణ భగవానుడు సత్యభామ సహాయంతో నరకాసురుని వధించి, దేవతల కష్టాలను అంత మొందించినందుకు విజయోత్సాహంగా ఈ పండుగను మన దేశంలో ఏటా రెండు మూడు రోజులు జరుపుకుంటున్నారు. లక్ష్మీనారాయణుల వివాహం జరిగిన రోజు అని కొందరి అభిప్రాయం. వంగ దేశ సాంప్రదాయం ప్రకారం బెంగాలీలు కాళీమాతను పూజిస్తారు. రావణ సంహరణాంతరం శ్రీరామచంద్రుడు అయోధ్యకు తిరిగి వచ్చి పట్టాభిషేకం జరుపుకున్న రోజు ఇది.

'తమసో మా జ్యోతిర్గమయా' అని భగవానుని ప్రార్థిస్తూ మనలోని జ్ఞాన దీపం వెలిగించుకుని అజ్ఞానాన్ని పోగొట్టుకోవాలి అని ఈ పండుగ సూచిస్తుంది. ప్రతి ఇల్లు దీపాలతో కళకళ లాడుతూ చీకట్లు తరిమివేస్తాయి, వెలుగుకు స్వాగతం పలుకుతాయి. మనలోని అహంకారమే నరకాసురుడు. ఆత్మజ్ఞాన మనే శ్రీకృష్ణ దర్శనంతో అహంకార మనే నరకాసురుడు అంత మవుతాడు. అదే శుభకరమైన దీపావళి. ఆంతర్యంలో దివ్యమైన వెలుగు చోటు చేసుకున్న రోజే దీపావళి.

ఉత్తరాదిన దీపావళి రోజున కొత్త సంవత్సరం మొదలవుతుంది. వ్యాపారాభివృద్ధికోసం లక్ష్మీ పూజ చేస్తారు. కొత్త ఖాతాల పుస్తకాలు ప్రారంభించి పూజలు చేస్తారు.

దిక్కులు పిక్కటిల్లే శబ్దాలతో రంగురంగుల కాంతులతో వెలిగే బాణసంచా కనులవిందు చేస్తాయి. చెడుపై మంచి సాధించిన విజయానికి సూచనగా ఈ పండుగను మన రాష్ట్రంలోనూ పూజలు భారీ ఎత్తున చేసుకుంటున్నారు. బంధుమిత్రులకు నూతన వస్త్రాలు, మిఠాయిలు, కానుకలు, బాణసంచా పంచిపెట్టడం మన దేశంలో ఆనవాయితీగా వస్తున్నది.

పిల్లలు పండుగ వారం రోజుల ముందునుండి చిన్న చిన్న తుపాకులతో కేప్స్ కాలుస్తూ హడావుడిగా తిరుగుతూంటారు. ప్రతి ఏడాదీ బాణసంచాపై ఖర్చు వృథా అని తెలిసినా, పిల్లలను సంతోషపరచడానికి ఎంతో కొంత ఖర్చు చేయక తప్పదు.

టపాసులు: దేశం మొత్తం మీద అన్ని రాష్ట్రాలకు సరఫరా అయ్యే బాణసంచా తమిళనాడులోని శివకాశిలోనే ఎక్కువ ఉత్పత్తి అవుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని ప్రాంతాలలో చాలా శక్తివంతమైన ఔట్లు, బాంబులు, జువ్వలు ఉత్పత్తి చేస్తున్నారు. తారాజువ్వలో పావురాన్ని పెట్టి ఆకాశంలోకి వదిలి, అది పేలిన తర్వాత పావురం సజీవంగా ఎగరడం మన రాష్ట్రంలోని పనివారల నైపుణ్యం అని చెప్పుకోవచ్చు. మిరుమిట్లు గొలిపే రంగురంగుల కాంతులతో, చెవులు చిల్లుపడే శబ్దాలతో ఆకాశంలో బాణసంచా వీనులవిందు, కనులవిందు చేస్తుంటే ఆనందించనివారు ఎవరుంటారు? ఇంటిల్లిపాదీ అందరూ ఆనందోత్సాహాలతో జరుపుకునే దీపావళి పండుగ ప్రతి ఒక్కరి హృదయాలలో తీపి గుర్తులా ఉండిపోతుంది.

కృష్ణాజీ



## పాసైతే

తండ్రి: ఒరే శ్రీనూ! నువ్వు కనుక పాసైతే నీకు కారు కొనిస్తా!

శ్రీను: మరి, నేను పాస్ కాకపోతే?

తండ్రి: ఆటో కొనిస్తాలేరా!

**- ముద్దా రమణమూర్తి (ఎస్. సద్లపల్లి)**

రెండేళ్లు అందరూ సఖ్యంగా ఉండగలిగితే అమెరికాకు చెమటలు పట్టడం ఖాయం!"

రాధ కళ్లనిండా కోపం తెచ్చుకుని, "మరీ మీ రెండో జన్మభూమి, చైనా ఏం చేస్తోందండీ? తన పారిశ్రామిక రంగాన్ని విదేశీ సంస్థలకు ఒప్పగించలేదా? లంచగొండితనం దినదినాభివృద్ధి కావడంలేదా? అక్కడి విద్యార్థులు చదువుల కోసం అమెరికా, యూరప్ దేశాలకు ఎందుకు పోతున్నారట?" అడిగింది.

"మీ అన్నయ్య అమెరికాలో ఉన్నాడు కదా! ఆయన రాశాడా ఈ విషయాలన్నీ!" రమేశ్ అడిగాడు.

మీరాబాయి నెమ్మదిగా అంది - "కొడుకులూ, కోడళ్లూ, ఆఖరికి అమ్మాయి రాధా ఒక టయ్యారు. నువ్వు ఒంటరివాడి వయ్యావ్!"

"చదువుకున్న మన మేధావులై ఉండి, అమెరికా పాట పాడడంతోనే అర్థం చేసుకోవచ్చు - వీళ్ల తెలివిని!"

చంద్రం వాచీ చూసుకుని, లలితవైపు చూసి, "మనం షాపింగ్‌కు వెళ్లాలి. యూనివర్సిటీకీ వెళ్లాలి. కదులు!"

"నేను రాలేనండీ! మీరు వెళ్లిరాకూడదా, ప్లీజ్ ...!"

"సరే, రమేశ్! నువ్వూ, రాధా రండి!"

"నాకు వేరే పని ఉంది!" రమేశ్ అన్నాడు.

"రాధతో నేను మాట్లాడాల్సి ఉంది. ఆమే, రమేశ్ ఈవేళ మన గెస్ట్‌లు. మీరు త్వరగా వస్తే అందరూ కలిసి అన్నాలు తిందాం!"

"సరే!" చంద్రం, ఆనంద్, రమేశ్‌లు బయటకు వెళ్లారు.

"ఆనంద్‌గాడి పెళ్లాం కూడా వస్తే బాగుండేది. అక్కడ ఒక్కత్తీ పిల్లలతో ఎలా ఉందో?"

"నాలుగు నెలల్లో వాళ్ల చెల్లెలి పెళ్లి ఉందండీ, అప్పుడు వస్తుంది!" లలిత అంది.

మీరాబాయి లేచి తన గదిలోకి వెళ్లింది. లలితా, రాధ వంటింట్లోకి వెళ్లారు. లలిత రాధని చూసి, "నీకు మా అత్తగారి దగ్గర బాగా చనువు ఉంది కదా, రాధా!" అని అడిగింది.

"చనువేమిటే ... చంక ఎక్కుతా నన్నా ఏమీ అనరు!"

లలిత నవ్వేసి అంది - "ఎందుకో ఆవిడ చాలా కాలంగా దిగులుగా ఉంటున్నారే! కారణం తెలియదు. రమేశ్ కూడా ఈ మధ్య ఇదే విషయం ఉత్తరంలో రాశాడు. ఆవిడ మనసులో ఉన్న దేమిటో మనం తెలుసుకోవాలి. మనిద్దరం కలిసి ఆవిడ్ని ..."

"అవును, లలితా! ఆవిడ ఒక్కొక్కసారి దుఃఖం మూటగట్టుకున్న మనిషిలా, ఏదో పోగొట్టుకున్నట్టు నాలుగయిదు రోజులు అదోలా ఉండిపోతారు."

"ఈ వంట కానిచ్చేసి, ఇద్దరం ఆవిడ్ని కూచోబెట్టుకుని అన్నీ అడుగుదాం. ఏమంటావ్?"

"నా కేం అభ్యంతరం లేదు."

✸ ✸ ✸

ఓ అరగంట గడిచింది. ఇంట్లో పనులన్నీ పూర్తి చేసి లలితా, రాధా మీరాబాయి గదిలోకి వెళ్లారు. ఆ గది పెద్దది. మూలగా ఓ మంచం, ఓ అల్మైరా, చిన్న టేబులూ, కుర్చీ, పాతది ఓ బట్టల స్టాండ్, గోడమీద మీరాబాయి గారి భర్త ఫొటో, దానికి అలంకరణగా చెమ్కీ దండ! ఓ పక్కన ఓ పెద్ద బుక్ రాక్, దాని నిండా పుస్తకాలు, బుక్ రాక్‌మీద కొడుకులూ, కోడళ్లూ, మనవల గ్రూప్ ఫొటోలు. మరో గోడకు గీతోపదేశం చేస్తున్న కృష్ణుడి ఫొటో. దానికి అటూ ఇటూగా వివేకానందుడు, శ్రీ అరబిందుల ఫొటోలు.

అప్పుడు మీరాబాయి మంచంమీద కళ్లు మూసుకుని పడుకుని ఉంది. లలిత, రాధ నెమ్మదిగా రెండు కుర్చీలు మంచం దగ్గరగా వేసుకుని కూర్చున్నారు.

ఆ చప్పుడుకు మీరాబాయి కళ్లు తెరిచి, "మీరా! ఏమిటి, పనులు అయినట్టేనా?" అని అడిగింది.

"మీకు ఆకలి వేస్తే చెప్పండి, అత్తయ్యా, పెట్టేస్తాను!"

"వాళ్లూ రానీ! అందరూ కలిసే తిందాం!" మీరాబాయి ఆ మాటలు అని తిరిగి మౌనంలోకి వెళ్లిపోయింది.

"రాధ ఉత్తరాల్లో ఎప్పుడూ మీ గురించే రాస్తుంది. దాని దృష్టిలో మీరు కన్నతల్లి కిందే లెక్క!"

"అవునమ్మా ...!"

"లలితా! ఈ ఉపోద్ఘాతం దేనికే?"

లలిత నవ్వేసింది. "మిమ్మల్ని ఓ మాట అడగాలని వచ్చాం, అత్తయ్యా!"

"ఏమిటీ?" మీరాబాయి కళ్లు తెరిచి, కుడి చేయి ఆసరా చేసుకుని కొద్దిగా లేచి తలగడాకు ఆనుకుని కూర్చుంది.

"మీ మనసులో ఏదో ఉంది. ఎప్పుడూ బాధపడుతూ ఉంటారు. ఆ విషయం ..." లలిత ఆగిపోయింది.

"ఇదా ... మామూలే!"

"కాదు, మా దగ్గర దాచడం న్యాయమా? మీ బాధని మేం తీర్చలేకపోయినా, కనీసం పంచుకుంటాం!"

"అయితే ఇందు కన్నమాట మీరు వాళ్లతో బయటకు పోకుండా ఇంట్లో ఉండిపోయింది. అవునా?"

"మాట తప్పించవద్దు! రాధకీ కొంత తెలుసు... చెప్పండి!"

మీరాబాయి మాట్లాడలేదు.

"ఇలా అయితే నేను ఇక ఎప్పుడూ ఇండియా రాను. లేకపోతే మిమ్మల్ని బలవంతంగానైనా అమెరికా తీసుకుపోతాం! చంద్రంతో చెప్తాను."

మీరాబాయి చిన్నగా తల ఆడించి అంది - "ఇంత ఆప్యాయంగా నా హృదయంలోకి తొంగి చూస్తా ననేవాళ్లు దొరకడం నా అదృష్టం. పైగా, మనసులో ఆవేదనను మాటల్లో పెట్టగలిగితే ఆ మాటలు మీతోపాటు దేవుడికి కూడా విన్నవించుకున్నట్టు అవుతుందేమో."

లలితా, రాధా నిశ్శబ్దంగా ఆవిడ మొహంలోకి చూశారు.

"ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్నానని అనిపిస్తుందమ్మా! కానీ అదేమిటో అర్థం కాదు. ఏదో

వెదుకులాట. భరించలేని ఆవేదనతో మనసు కిందా మీదా అయిపోతుంది. ఇలా నాలుగైదు ఏళ్లుగా ఉంది!" అంటూ తన అవస్థ గురించి చెప్పింది. ఆమె కంఠం ఒణికింది. ఆమె కళ్ల నీళ్లు చిమ్ముకున్నాయి. శరీరం తడబడింది.

లలిత అత్తగారి వీపుమీదా, చేతిమీదా ప్రేమగా రాసింది తన చేత్తో. ఆపైన, "మీరు కంగారు పడవద్దు ... సర్దుకోండి!" అంది.

రాధ కాస్త మంచం మీదకు వంగి, మీరాబాయిని చూస్తూ అంది - "మీరూ, మీ సంసార జీవితం, ఆ పైన బాబయ్యగారు పోవడం, ఈ ఒంటరితనం ... ఇవి మిమ్మల్ని పరోక్షంగా బాధిస్తున్నాయేమో!"

'ఆ నిరాశ ఏం లేదమ్మా! నాకు తీరని కోరిక లేం లేవు. బహుశా ఇది మనసుకు, హృదయానికి సంబంధించినదేమో! వంటింట్లో ఉన్నా, పని చేస్తున్నా, బయటకు వెళ్లినా ఆ వెదుకులాట నన్ను వెంబడిస్తూనే ఉంటుంది.'

"ఒంటరితనంతో బాధపడే పెద్దవాళ్లు అమెరికాలో మనకు ఎక్కువగా కనిపిస్తూంటారు. ఇప్పుడిప్పుడు చాలామంది పెద్దవాళ్లు తమకని ఓ వాతావరణం సృష్టించుకుంటారు. ఏదో పని చేస్తూ ఉంటారు. చర్చికి వెడతారు. ఆధ్యాత్మిక విషయాలపట్ల ఆసక్తి పెంచుకుంటారు. పుస్తకాలు ... ఫిలాసఫీకి సంబంధించినవి, ముఖ్యంగా మన గీతా, ఉపనిషత్తులూ చదువుతూ ఉంటారు."

"అవును, పిన్నిగారూ! మీకు తెలుసు ... నేనూ ఫిలాసఫీలో డిగ్రీ చేశానని. పైగా చిన్నప్పుడు మా అమ్మతో గోష్ఠులకు వెడుతూ ఉండేదాన్ని. ఒక్క మాటలో చెప్పాలంటే మనిషికి మనసుతో, పంచేంద్రియాలతో భేటీ తప్పదంటారు. అవి విసిరే సవాళ్లను మేధతో కాకుండా హృదయం వైపు నుంచి పరిష్కరించుకోవాలిట."

"అవును, అత్తయ్యా! మనింట్లో ఇన్ని పుస్తకాలు ఉన్నాయి. కావాలంటే రాధ కొని తెస్తుంది. మీరు పుస్తకాలను వదలద్దు! ఊళ్లో రెలిజియస్ డిస్కోర్సెస్ జరుగుతూంటే వెడుతూండండి!"

"ఈ ఊరికి తరుచు సుందరానందమూర్తిగారని ఓ తత్వవేత్త వస్తూ ఉంటారు. సత్సంగ్‌లు జరుగుతాయి. ఓసారి ఆయన ఇంటెగ్రల్ యోగా మీద లెక్చర్ ఇస్తుంటే నేను వెళ్లాను."

"మీ ఆయన కీ విషయాలు తెలియవేమో? లేకపోతే బ్రెయిన్ వాష్ చేయించడం కోసం వెంటనే నిన్ను చైనా పంపించేస్తాడు, జాగ్రత్త!" అంది లలిత రాధను చూస్తూ.

"నీకు తెలియదేమో, లలితా! మన దేశంలో చాలామంది వీర కమ్యూనిస్టులు మూడో కంటికి తెలియకుండా ఇంట్లో పూజలూ, పునస్కారాలూ చేస్తూనే ఉంటారు. దొంగతనంగా ముసుగేసుకుని తిరుపతి వెడతారు. కానైతే, గుండు చేయించుకోరు. ఆయనా ఆ కోవలోనివాడే!"

"తప్పు, రాధా!" అంది మీరాబాయి.

"ఆయనకి తను మేధావినని నమ్మకం. భౌతికవాద మొక్కటే తెలుసు. మావో, లెనిన్ ... వీళ్లే దేవుళ్లంటే. మేధమీద నూటికి నూరుపాళ్లూ ఆధారపడ్డ వాళ్లకు హృదయ రాగాలు వినిపించవు, లలితా!"

"అతనూ దేవుణ్ణీ, అయన ఉనికినీ, ఆయన ప్రేమను తెలుసుకునే రోజు వస్తుంది."

"కట్టుకున్న దాన్ని ప్రేమించనివాడికి కనబడనివాడు వరాలు ఇస్తాడంటావా, లలితా!" బాధగా అంది రాధ.

'తప్పకుండా! నువ్వే నమ్మలేనంత పరివర్తన రమేశ్‌లో వస్తుంది, చూడు!'

ఇంతలో బయట టాక్సీ ఆగిన చప్పుడయింది. ఆ తర్వాత బిలబిలమంటూ చంద్రం, ఆనంద్, మరో ఇద్దరు స్నేహితులూ లోపలికి వచ్చారు.

✸ ✸ ✸


మీరాబాయి ఇద్దరు కొడుకులు, కోడలు తిరిగి అమెరికా వెళ్లిపోయారు. ఆవిడ తిరిగి ఒంటరిదయింది. కానీ ఆవిడకు ఇంకా లలిత తన పక్కనే కూర్చుని కబుర్లు చెబుతున్నట్టుగానే ఉంది. లలితా, రాధా చెప్పినట్టు పుస్తకాలు చదివితే తను పోగొట్టుకున్న దేమిటో అర్థం అవడమే కాకుడా, అది పొందడం ఎలాగో కూడా తెలుస్తుం దనిపించింది. పూర్వంలో భర్త సేకరించి ఉంచిన పుస్తకాలు ఆవిడ చదివేది. భర్త తను చదివింది



అర్థ మయ్యేట్టుగా ఆవిడకు కథలుగా చెప్పేవాడు. "అర్థమవుతోందా, నా కంఠశోషేనా?" అని మధ్య మధ్యలో అడిగేవాడు. తను "ఊఁ" అనేది. మీరాబాయి తిరిగి పుస్తకాలు ఆత్రంగా చదవడం మొదలుపెట్టింది. మార్కెట్‌కు వెళ్లినప్పుడు వివేకానందుడివి, శ్రీ అరబిందోవి దొరికిన పుస్తకాలు ఖరీదు చేయడం అలవా టయింది. రాధ చొరవగా పాల్ బ్రన్టన్ 'ఏ సెర్చి ఇన్ సీక్రెట్ ఇండియా', పీటర్ రెండల్స్ రాసిన 'చక్రాస్', డేవిడ్ కిన్‌స్లే రాసిన 'ది సోర్డ్ అండ్ ది ఫ్లూట్' పుస్తకాలు కొని ఇచ్చింది.

'మనిద్దరం కలిసి చదువుదాం. నేను తోడుగా ఉంటాను. బాబయ్యగారిలా నేను మీకు చదివి వినిపిస్తాను. మీరు ఊ కొట్టండి. సరేనా?'

మీరాబాయి నవ్వేసేది. ఒకటి, రెండు, ఆరు నెలలు అలా దొర్లిపోయాయి. ఆవిడకు ఒక్కొక్క పుస్తకం చేయి పుచ్చుకుని నడిపిస్తూ కొత్త లోకాలకు తీసుకువెడుతున్నట్టుగా ఉంది. ఏదో తృప్తి, చిన్నపాటి ఆనందం. ప్రతి పుస్తకం కూడా 'ప్రపంచం, సమాజం, తోటి మానవులను అర్థం చేసుకునే ముందు నిన్ను నువ్వు తెలుసుకో'మని చెప్పడం, 'నీ భౌతిక,మానసిక చైతన్య స్థితులను ఉన్నత దిశలవైపు మరల్చుకో'మని అనడం ఆమెకు ఆశ్చర్యాన్నీ, ఆనందాన్నీ కలగజేశాయి. మనసు లోపలి పొరలి హృదయాంతర సీమల్నీ, ధ్యాన, భక్తి, కర్మ మార్గాలలో ప్రక్షాళనం చేసుకోగలిగితే, ఆధ్యాత్మికత తాలూకు అంచులు అందుతాయని చెప్పడంలో సత్యం అవగాహనలోకి రాసాగింది!





## పొట్టివారు లేని ఏకైక దేశం!

ప్రతి దేశంలోనూ పొట్టివారూ, పొడుగువారూ ఉండటం సహజమే కదా! అలాంటిది ఒక్కరంటే ఒక్కరు కూడా పొట్టివారు లేని ఏకైక దేశం రువాండా.నిన్న మొన్నటి వరకు అంతర్యుద్ధపు ఉక్కుపాదాల కింద ఉక్కిరి బిక్కిరిఅయిన రువాండాలో అందరూ పొడగరి వ్యక్తులే! సగటున పురుషులు ఆరున్నర అడుగుల ఎత్తు, స్త్రీలు అయిదు అడుగుల పది అంగుళాల పొడవు ఉంటారు. ఇకపోతే, రువాండాలో పొట్టివారంటే అర్థం ఐదూ, ఐదున్నర అడుగుల పొడవు వ్యక్తులు. అయితే వీరుకూడా మొత్తం జనాభాలో 100కి మించి ఉండరు!

**- కెఆర్కె మూర్తి (ఎర్రబోడు)**

ఆధ్యాత్మిక వాదుల తపన ఒకటే అనిపిస్తుంది - అటు ఇటుగా! కొందరు ప్రాపంచిక సుఖాలను నిరసించి, వైరాగ్యంతో ప్రపంచానికి దూరంగా జరగ మంటారు. స్వీయ ముక్తికి పెద్ద పీట వేస్తారు. వివేకానందుడి లాంటివారు మానవ సేవ ద్వారా, త్యాగనిరతి ద్వారా దేవుని ఉనికి అర్థమవుతుం దంటారు. శ్రీ అరవిందులు తన పూర్ణయోగంలో మనిషి తన వ్యక్తిగత మోక్షానికీ, ముక్తికీ ప్రాధాన్యత ఇవ్వకూడదనీ, అంతకు మించి ఈ విశ్వాన్ని తన ఆత్మోన్నతి ద్వారా ఉజ్వల కాంతితో స్నానం చేయించి, తను ఉంటున్న భూమిమీదే భగవంతుడి ప్రతిరూపంగా, దివ్య చైతన్య పురుషుడిగా ఎదగగలగా లంటారు.

మీరాబాయి ఆ వేళ 'ది యోగా ఆఫ్ లవ్' అనే పుస్తకం చదువుతోంది. ఆమెకు ఆ పుస్తకంలో ప్రతి అక్షరం పెన్నిధిగానే తోచింది. మొత్తం పుస్తకం మరోసారి చదివింది. హృదయం ఉప్పొంగినట్టయింది. అందులో ఒకచోట ... 'భగవంతుణ్ణి దర్శించడానికీ, ఆయన్ను అనుభవంలోకి తెచ్చుకునే సులువైన మార్గమూ ప్రేమ ఒక్కటే. కొంతమంది ప్రేమభావాన్ని మనిషి తాలూకు బలహీనతగా చెప్తారు. కానీ ప్రేమ కూడా ఒక శక్తే! నిజానికి మానవుల మధ్య చోటు చేసుకుని ఉండి, అందరూ అనుకునే సాధారణమైన ప్రేమ కూడా అమర ప్రేమ తాలూకు ఒక అంశే! అది దివ్య ప్రేమకు దారి చూపే దివ్వే!'

మీరాబాయి పుస్తకం మూసి అలానే చూస్తూండిపోయింది. గోడమీద ఉన్న రాధాకృష్ణుల ఫొటో కొత్తగా కనిపించింది. ఆ ఇద్దరి వదనాల్లో ప్రశాంతత. ఆ నాలుగు కళ్లల్లో జాలువారే ఆరాధనా తత్వం. వారి భంగిమల్లో గొప్ప సౌందర్యం, శ్రీకృష్ణుని చూస్తూ రాధ, రాధని చూస్తున్న శ్రీకృష్ణుడు - ఇద్దరూ దివ్య ప్రేమకు భాష్యం చెబుతున్నట్టుగా ఉన్నారు. ఆమె కదలిక లేకుండా, ఊపిరి బిగవట్టుకుని, కనురెప్పల కదలికల్ని శాసించుకుంటూ మైమరుస్తూ ఉండిపోయింది చాలాసేపు.

సరిగ్గా అప్పుడే రాధ మీరాబాయి గదిలోకి వచ్చింది. కాసేపు మౌనంగా నిలబడి దగ్గింది. ఆపైన ఆవిడ దగ్గరకు వెళ్లి, "నేను, రాధను, పిన్నిగారూ! ఏమిటి ఆలోచిస్తున్నారు?" అని అడిగింది.

మీరాబాయి కొంచెం కదిలి, గుండెల మీద ఉన్న 'ది యోగా ఆఫ్ లవ్' పుస్తకం చేతుల్లోకి తీసుకుని, "ఇది చదివాను, రాధా!" అంది.

రాధ ఆ పుస్తకం తను తీసుకుని, పేజీలు తిప్పి, "ఈవేళ ఈ విషయం మీదే మన టౌన్ హాల్లో సుందరానందమూర్తిగారు మాట్లాడుతున్నారు. ఆ విషయం చెబుదామనే వచ్చాను. వెడదాం, వస్తారా!" అడిగింది.

"అలానా? మంచిదమ్మా!"

"ఆయన్నోసారి చూశారంటే, ఆయన ఉపన్యాసం విన్నారంటే మీరు తప్పకుండా కొత్త మనిషి అవుతారు!" రాధ చెబుతోంది.

* * *

టౌన్‌హాల్లో డయాస్ అందంగా అలంకరించి ఉంది. వెనక గోడమీద కాషాయరంగు కర్టెన్‌కి ఓం అనే ఏకాక్షరం పూలతో అలంకరించారు. ఓ టేబుల్, ఓ కుర్చీ, చిన్న ఫ్లవర్ వాజ్‌లో పొడవాటి కాడలతో ఉన్న ఎర్ర గులాబీలు. అప్పుడు ఓ ఆర్గనైజర్ వచ్చి కార్యక్రమం గురించి చెప్పాడు. లెక్చర్ ఆన్ ది యోగా ఆఫ్ లవ్ గురించి సుందరానందమూర్తిగారు మాట్లాడతారనీ, ఆ తర్వాత ఓ పది నిమిషాలు భక్తుల సంశయాలు తీర్చడం జరుగుతుందనీ చెప్పి సుందరానందమూర్తిని వేదిక మీదకు ఆహ్వానించాడు.

సుందరానందమూర్తి వేదిక మీదకు వచ్చి కుర్చీలో కూర్చునేముందు ఆహ్వానితులకు వందనం చేశాడు. ఆయనకు ఏభై ఏళ్లు ఉంటాయి. కాంతివంతమైన మొహం, విశాలమైన కళ్లు, పెద్ద నుదురు. అందమైన ముక్కు, చిన్న పెదవులు, తెల్లని ఖద్దరు పంచె, ఖద్దరు చొక్కా ధరించాడు. భుజాలమీద ఎరుపూ, ఆకుపచ్చ రంగులున్న చిన్న కండువా. నుదుటున చిన్న కుంకుమ బొట్టు. సుందరానందమూర్తి చిన్నగా ప్రార్థన చేసి తన ముందు ఉన్న మైకుని దగ్గరగా తీసుకుని ఉపన్యాసం మొదలుపెట్టాడు - "ఈ రోజు మాట్లాడవలసిన అంశం దివ్య ప్రేమ. బహుశా నేను మామూలు ప్రేమ గురించి మాట్లాడతానని తెలిస్తే సభికులు మరింత ఎక్కువమంది వచ్చేవారేమో!" అని ఆగాడు.

అందరూ మౌనంగా తమలో తామే నవ్వుకున్నారు.


"ఈ రోజుల్లో ఎక్కడ చూసినా, ప్రపంచం అంతటా కూడా మామూలు ప్రేమ, లేక అనవసరపు ప్రేమే - నటనే మనకు ఎక్కువగా కనిపిస్తోంది. ఇప్పుడు ఎవరినైనా ప్రేమ అంటే ఏమిటని అడిగితే రకరకాల అభిప్రాయాలు మనకు వినబడతాయి. అయితే మనుషుల్లో ప్రేమపట్ల గౌరవభావం లేదనీ, అందరూ దాన్ని ఓ కమోడిటీగా చూస్తున్నారని చాలామంది అనుకోవడం మనకు తెలుసు. ఇది బాధపడవలసిన విషయం కాదని నేను మీకు మనవి చేస్తున్నాను. ఇది ఈ యుగ లక్షణం. ఏ విలువల క్షీణదశను చూసి మనం విచారించకూడదు. విచారణే చేయాలి.

"అసలు దివ్య ప్రేమ అనే మాటకు శ్రీకారం చుట్టిందీ, దాని రూపు రేఖా విలాసాదులు ఎలా ఉంటాయో, ఆ దివ్య ప్రేమను ఎలా అనుభవంలోకి తెచ్చుకోవాలో ముందు చెప్పింది నారదముని! ఆయన దీని గురించి చెబుతూ, 'భగవంతుణ్ణి ప్రేమించే తత్వంలో కారణాకారణాలు ఉండవు. అది స్వచ్ఛమైనది. ఇంపైనది. అజరామరం మయింది' అంటాడు. దివ్య ప్రేమ అనుభవంలోకి వచ్చినవారు సంపూర్ణులు, చిరంజీవులు అవుతారు అని ఘంటాపథంగా చెప్పాడు. ఆ తరువాతి ఋషులైన పరాశరుడు, గార్గి, శాండిల్యుడు దివ్యప్రేమను వారి వారి మాటల్లో ఎలా చెప్పారో వివరణలు చెప్పారు. ఒక ఋషి ప్రేమను సెల్ఫ్ ఎంప్లాయిమెంట్‌గా చెప్పారు. మరొక ఋషి నిత్యం పరమాత్మ గురించిన జిజ్ఞాసతో ఉండగలగడం అంటారు... ... ..." అంటూ చెప్పి, సుందరానందమూర్తి తన ఉపన్యాసం ముగించారు.

**ముగింపు పైవారం**

# వర ప్రసాదం

శ్రీసుభా





## వారం వారం కథాప్రభ

(గత పంచిక తరువాయి)

**ఆ తరువాత సభికులు సుందరానందమూర్తిని తమ సంశయాలను ప్రశ్నల రూపంలో అడిగారు.**

**"దివ్య ప్రేమలో మైమరచిన వారికి ఇబ్బందులు అనేవి ఉండవా? అన్నీ లాభాలేనా?'**

"ఇబ్బంది అల్లా ఒక్కటే ... అది ప్రాపంచిక విషయాలకు అతీతంగా ఉంటుంది. రాగద్వేషాలు పోతాయి. దానిమూలంగా ఆత్మలో పరమానందం జొరబడి తన సామ్రాజ్యాన్ని ఏర్పరుచుకుంటుంది."

"మనసులో పుట్టే ఆలోచనల్ని ఆధారం చేసుకుని, లెక్కలు కట్టి కూడికలూ, తీసివేతలూ చేస్తే అర్థం కానివాడు పరమాత్మ. నాలో పరమాత్మ ఉన్నాడనే ఫీలింగ్, ఆ నమ్మకం ముఖ్యం. ఆయన తప్పిస్తే నేను లేను. ఆయన ఉనికి మూలంగానే నేను ఉండడం జరుగుతోందనే నమ్మకమే ఆరాధనకు ఆలంబన."

"మనిషికి మేలుచేసేది విజ్ఞానం అంటారు. తద్వారా భగవంతుణ్ణి దర్శించ లేమా?"

"నిజమైన విజ్ఞానం ప్రేమతోనే పరిపక్వ మవుతుంది."

అలా ఆ సభలో వింటున్నవాళ్లు, ప్రశ్నిస్తున్నవాళ్లూ రకరకాల అనుభూతుల మధ్య ఆనందాన్ని వెదుక్కుంటున్నారు.



ముందువరసలో ఆడవాళ్ల మధ్య కూర్చున్న మీరాబాయి తదేక ధ్యానంతో సుందరానందమూర్తి వైపు చూస్తోంది. ఆవిడ పక్కన కూర్చున్న రాధ, "లేవండీ, మనమూ వారి ఆశీర్వాదాలు తీసుకుందాం!" అంది.

జనం ఒక్కక్కరూ వేదికమీదకు వెళ్లి చేతుల్లోని పూలను ఆయనకు సమర్పించి దీవెనలు తీసుకుంటున్నారు. అలాగే మీరాబాయి వంగి, ఆయన పాదాలు తాకి, లేస్తూ సుందరానందమూర్తి మొహంలోకి చూసింది. ఆవిడకు, ఆయన మొహంలోని ప్రశాంతత ఓదార్పుగా మారి తనకు అందుతోన్నట్టు అనిపించింది. ఆయనలో ఉన్న ఓ గొప్ప కాంతి, పరిమళభరితమవుతూ తనను చుట్టుముడుతున్నట్టుగా తోచింది. మీరాబాయి సంతృప్తితో వేదిక దిగింది.

***

ఆవేళ - మీరాబాయి, రాధా చెరో వైపు కూర్చుని రమేశ్‌కు సుందరానంద మూర్తిగారి ఉపన్యాసం గురించి వివరంగా చెప్పారు. ఆ తర్వాత కబుర్లు తాత్వికుల మీదకు వెళ్లాయి. రాధ తులసీదాసు, వివేకానంద జీవితాల్లోని ఆశ్చర్యం కలిగించే విషయాల గురించి చెప్పింది. తులసీదాసు ఒకసారి భార్యా వియోగం భరించలేక తుఫానులో అర్ధరాత్రి నదిని దాటి అత్తవారింటికి వెళ్లడం, భార్య పై అంతస్తులో ఉందని తెలిసి, దారి తెలియక పాముని తాడు అనుకుని దాని ఆసరాతో పైకి ఎగబాకి పోవడం, ఆయన్ని చూసి ఆవిడ 'నామీద ఉన్న ప్రేమలో సగం ఆ రాముని పట్ల చూపగలిగితే మీరు ఆయన్ని ఏనాడో దర్శించగలిగి ఉండేవా'రని దెప్పి పొడవడం ... ఆ కథలూ చెప్పింది.

"నువ్వు అలాంటిదానివేమో కానీ, నేను మాత్రం చచ్చినా తులసీదాసును కాను!" అన్నాడు రమేశ్.

"వివేకమతులైన భార్యలు అన్ని కాలాల్లోనూ ఉంటారనీ, వాళ్లు తప్పుదారిన పోయే భర్తల్ని సన్మార్గులుగా చేస్తారనీ ఈ కథలో నీతి!" అంటూ రాధ - వివేకానందుడూ గర్విష్టి అయిన చదువరీ కథ చెప్పింది. పుస్తకాలు చదవకుండా లోకాన్ని అర్థం చేసుకున్నాననీ, తనకే సర్వస్వం తెలుసుననే అహం ఎలా నవ్వులపాలు చేస్తుందో వివరించింది.

రమేశ్‌కి కోపం వచ్చింది. కళ్లెర్రబడ్డాయి. అందుకే కోపంగా, "వాళ్ల సంగతి ఎందుకు? మనం ఈవేళ చూస్తున్న స్వాముల గురించి చెప్పు. గాలిలోంచి నానారకాల వస్తువులు సృష్టిస్తున్నామని ప్రజల్ని భ్రమపెడతారు. ఇది తంత్రం కాదు. కుతంత్రం!" అన్నాడు.

"చూడమ్మా, రమేశ్! మన తంత్ర శాస్త్రం గుంభనగా ఇవన్నీ చెప్తోంది. ఆదీ శాస్త్రమే. కఠోర దీక్షతో అది నేర్చినవారికి, సాధకులకు - భూమికి అతి సమీపంలో ఉండే సటిల్ ఫిజికల్ ప్లేన్‌లోని శక్తులు సహాయపడతాయి."

"ఇది మూఢ నమ్మకం అంటాను."

"భర్తగారూ! మీకు తెలియదేమో...తంత్రశాస్త్రంలో మెటీరియలైజేషన్, డి-మెటీ రియలైజేషన్ అనే రెండు ప్రక్రియ లున్నాయి. అమితమైన భక్తితో, అమోఘమైన శక్తితో దేన్నయినా సృష్టించవచ్చు. తిరిగి దాన్ని మాయమూ చేయవచ్చు."

"అయితే ప్రపంచంలో ఉన్న లేమిని ఎందుకు మటుమాయం చేయ రీ మహానుభావులంతా?" విసుగ్గా అన్నాడు రమేశ్.


"అయాచితంగా వచ్చే సుఖాలకు అలవాటుపడ్డ మనిషి స్వీయశక్తినీ, కష్టాన్నీ మరిచిపోయి సోమరు లవుతారని!"

మీరాబాయి అంది: "రమేశ్! నీకు రష్యా, చైనాల గురించీ కమ్యూనిజం గురించి కావల్సినంత అవగాహన ఉండచ్చు. కానీ కమ్యూనిజం ఎందుకు పుట్టిందో నీకు తెలుసా...ప్రపంచంలో - ముఖ్యంగా యూరప్‌లో వెర్రితలలు వేసిన రాజరికానికి, ఫ్యూడలిజానికి విరుగుడుగా! రాచరికంనుంచి ఒకేసారి ప్రజాస్వామ్యం ప్రభవించి బట్టకట్టడం కష్టం. కమ్యూనిజం మానవశక్తిని ప్రతిఫలిస్తుంది. ఇది రెండవ దశ. కానీ కమ్యూనిజం శాశ్వతం అనుకోవడం వెర్రితనం. దాని తరువాత దశలోనే ఇప్పుడు ప్రపంచం అడుగిడబోతోంది. 'ఈ ప్రపంచం అంతా ఎరుపైనప్పుడే మానవజాతికి మంచి రోజులు' అనే మీ మావోగారి అభిప్రాయాలతో చరిత్ర ఏకీభవించలేదు...చూశావా?"

'నేను ఒప్పుకోను. రాధే కాదు; మీరూ చాందసు లవుతున్నారు. నాకు పనుంది!'అంటూ రమేశ్ లేచాడు.

"నువ్వు మామూలు వాదనలో కూడా అపజయాన్ని అంగీకరించలేవు. వాస్తవాలకు తల ఒగ్గే నేర్పు కమ్యూనిజానికి ఉండదేమో. నువ్వూ అలాగే ..." రాధ ఆగిపోయింది.

# ముసలి పోలీసులు - నో నేరాలు!




ఆరిజానా రాష్ట్రంలోని సన్‌సిటీలోని పోలీసుల సగటు వయసు 74. వాళ్లు పిస్తోళ్లు ధరించరు. కారులోని వైర్‌లెస్ సెట్లే ప్రధాన ఆయుధం. 45 వేలమంది ప్రజలు గల ఈ ఊరు క్రైమ్ ఫ్రీ ఊరు. సేఫ్ టౌన్!

185 మంది పోలీసులు గల ఈ ఊళ్లో 12 పోలీసు కార్లు ఉన్నాయి. వారి కనీస వయసు 56. 86 ఏళ్లుగలవాళ్లు కూడా ఆ పోలీసు బృందంలో ఉన్నారు. ఇల్లు తాళంపెట్టి వెళ్తే ఆ ఇంటిని దొంగలు దోచకుండా ఓ కన్ను వేసి ఉంచుతారు. ఈ పోలీసు లెవరూ జీతాలు తీసుకోరు. సమాజ సేవా దృక్పథంతో పనిచేస్తున్నారు. గత 20 ఏళ్లుగా ఈ పోలీసు బృందం విజయవంతంగా పనిచేస్తూండడంతో, అమెరికాలోని ఇతర ఊళ్లలోనివారు కూడా ఇలాంటి పోలీసు బృందాలను ఏర్పాటు చేయడానికి ఆలోచిస్తున్నారు.

- ఎం. లిపి

"నువ్వీమధ్య పెర్సనల్ అటాక్స్‌కి దిగుతున్నావ్ ..."

"మనమధ్య ఉన్నవి ఐడిలాజికల్ డిఫరెన్సెస్ మాత్రమేనని నేను అనుకుంటున్నాను!" రాధ ఆగిపోయింది.

"ఊరుకో, రాధా! ఇవన్నీ చిన్న విషయాలు. మనసులు పాడుచేసుకోవద్దు. అంతేనా, రమేశ్?' ' అంది మీరాబాయి అనునయంగా.

"నేను వెడుతున్నాను!" అంటూ రమేశ్ బయటకు వెళ్లిపోయాడు.

మీరాబాయి చటుక్కున రాధ మొహంలోకి చూసి ఏదో గుర్తు చేసుకుని, "ఓ మాట, రాధా!"

"ఏమిటీ?"

"ఆయన...అదే సుందరానందమూర్తి ఇప్పుడు ఎక్కడ ఉన్నారంటావ్?"

"ఈ ఊళ్లోనే ఉండవచ్చు."

"అయితే ..."

"చెప్పండి?"

"ఒకసారి ఆయన్ని దర్శించాలని ఉందమ్మా! ఆయన్ని చూడగానే నేను వెదికే మనిషి ఈయనే అనిపించింది."

"నేను ఆర్గనైజర్స్‌కి ఫోన్ చేసి అడుగుతాను, సరేనాండీ!"

"సరేనమ్మా!"

* * *

సుందరానందమూర్తి అప్పుడు తన గదిలో కుర్చీలో కూర్చుని ఉన్నాడు. ఆయన వెనక గోడకి వివేకానంద, శ్రీ అరబిందో ఫొటోలు ఉన్నాయి. వాటికింద చిన్న టేబుల్ ఉంది. దానిమీద స్టాండ్‌లో అగరబత్తీలు వెలుగుతున్నాయి. ఆయన్ని స్వయంగా కలుసుకుని తమ సొంతగోడు వినిపించి మార్గాంతరాలు అడిగేవారు కొంతమంది. బాధతో, నిరాశతో, పగిలిన హృదయాలతో వచ్చినవారు మరికొందరు. అందరూ కలిసి పదిమంది ఉన్నారు. లోపలికి వెళ్లి ఒక్కొక్కరే తిరిగి వస్తున్నారు. మీరాబాయి పిలుపు వచ్చింది. ఆవిడతో వచ్చిన రాధ 'వెళ్లిరండి!' అన్నట్టు చూసింది.

మీరాబాయి పమిట కొంగును తలనిండా కప్పుకుంది. ఎందుకో ఆమె గుండెలు వేగంగా కొట్టుకోవడం మొదలుపెట్టాయి. ఏదో ఆత్రుత. అది తట్టుకుందుకు ఆవిడ ఓసారి గుండెలమీద చేయి వేసుకుని మౌనంగా లోలోపల దైవ నామస్మరణ మొదలుపెట్టింది. నెమ్మదిగా కర్టెన్ తొలగించి లోపలకు వెళ్లింది. వెంటనే చేతులెత్తి నమస్కరించి, వంగి ఆయన పాదాలను కుడిచేత్తో తాకి, చేతిలో పూలను సుందరానందమూర్తి చేతులకు అందించింది. తన పేరు చెప్పింది. "కూర్చోండి" ఆయన నవ్వు మొహంతో కుర్చీ చూపించాడు. ఆపైన "మీ సంశయం ఏదైనా సరే అడగండమ్మా! నేను మీ మనిషినే అనుకోండి!" అంటూ ఎంతో ఆప్యాయంగా పలకరించి ఆయన మీరాబాయి కళ్లల్లోకి చూశాడు క్షణం.

మీరాబాయి తన మనసులో పాతుకుపోయిన ఆందోళన గురించీ, మనసును మలినపరుస్తున్న ఆవేదన గురించీ చెప్పింది. ఏళ్లుగా బాధిస్తున్న ఒంటరితనం, ఎడారిగా, మరుభూమిగా మారిన హృదయావేదన వివరించింది. అలా చెప్తుంటే ఆమెలో బాధ ఉప్పొంగి కళ్లవెంట నీరు తిరిగింది. అది ధారగా మారింది. ఆపైన ఆమె మాటలురాని స్థితిలోకి దిగజారింది. ఉద్వేగభరితమైన గుండె చప్పుడును అదుపులోకి తెచ్చుకుంటోంది. ఆ తర్వాత ఆమె మనసులోని ఆలోచనలన్నీ మటుమాయమై, ఆలోచనా కేంద్రమైన, ఆవేదనా నిలయమైన మేధ...రాగ విరాగాల మధ్య

ఊగిసలాటకు స్వస్తి పలుకుతోంది. ఎన్నో ఏళ్లుగా హృదయంలో తనదనే ఉనికి పోగొట్టుకుని చిక్కిశల్యమైన ప్రేమ తలెత్తి, ఆత్మీయతా హస్తం గురించి అర్రులు జాస్తోంది.

“నా జీవితం అనంవూర్ణమైనదని అనిపిస్తూంటుంది. పరమాత్మ నన్ను తన చల్లని చూపుతో, ప్రేమ భావంతో దగ్గరకు తీసుకునేటట్టు ఆశీర్వదించండి.”

సుందరానందమూర్తి ఆప్యాయంగా ఆమె తల నిమిరాడు. తర్వాత ఆమె చుబుకాన్ని తన చేత్తో ఎత్తి, కళ్లల్లోకి చూస్తూ వాటిని ప్రదీప్తం చేశాడు.

“చూడమ్మా! మీ కోరిక తీరడానికి నేను సహకరించగలిగితే అది నాకు అత్యద్భుతమైన ఆనందాన్నీ, తృప్తినీ ఇస్తుంది. పరమాత్మ మీలోనే ఉన్నాడు. ప్రశాంతంగా, అలజడికి లోనవకుండా చూడండి, కనిపిస్తాడు!” ఆయన అలా మీరాబాయిని అనునయిస్తూనే ఉన్నాడు.

సుందరానందమూర్తి మాటలు మీరాబాయిని తాకుతున్నాయి. ఆయన మాటల్లోని ధైర్య వచనాలు ఆశీర్వాదాలై ఆమెను ముంచెత్తుతున్నాయి. ఒక చల్లని శీతల వాయువుతో ఆమె శరీరంలోని అణువులు చిత్ర విచిత్రంగా పరిభ్రమణాలు చేస్తున్నాయి. కళ్లముందు రంగుల లోకాలు ... వీనుల్లో మృదు మధుర గానాలాపన. ప్రేమతో ఎవరో వీపును నిమిరినట్టు, వెన్ను తట్టినట్టు, శిరస్సుమీద చేయి వేసి స్పృశించినట్టు ... పురాతనమై, శిథిలమవుతున్న శరీరంలోపల గర్భగుడి లాంటి హృదయం ... దాని దరిదాపుల్లో వెలుగుతూ ఉండే ఆత్మను మరింత ప్రదీప్తం చేస్తూ, యుగయుగాల ప్రేమతత్త్వంతో దానిని అభిషేకిస్తున్నట్టు .... అంతా అంతా ఆమెకు అప్పుడు ఆనందమే! పరమానందమే ... సచ్చిదానందమే అవుతోంది.

మీరాబాయి తనకు తెలియకుండానే లేచింది. తెలియకుండానే అడుగులు వేసింది. గది దాటి బయటకు వెళ్లింది. ఆమె అచేతనంగానే కాకుండా ఆనంద స్వరూపిణిగా ముందుకు నడిచి వెడుతూంటే రాధ ఆశ్చర్యంగా వెనకే వెళ్లింది.

***

మీరాబాయి రెండురోజులు ఏకాంతంగా ఇంట్లోనే ఉండిపోయింది. ఆమెకు కుర్చీలో కూర్చున్నా, మంచంమీద పడుకున్నా, కిటికీ తెరిచి వీథిలోకి చూసినా, డాబామీదకు వెళ్లి ఆకాశం వైపు పరిశీలించినా అంతా కొత్తగా ఉంది. అంతా నిత్య నూతనంగా కనబడుతోంది. ఇంట్లోని ప్రతి వస్తువూ అందంగా కనిపిస్తోంది. ఆవిడకు తను మ రెవరి శరీరంలోకో పరకాయ ప్రవేశం చేసినట్టు అనిపిస్తోంది. కాలం మాటలురాని పసివాడిలా తప్పటడుగులు వేస్తున్నట్లు, ఆపైన చంటి పిల్లవాడిగా మారి చంకనెక్కి గారాలు పోతున్నట్టు గొప్పదైన సంతృప్తి కలుగుతోంది. ఆకాశం, సూర్యచంద్రులు, నక్షత్రాలు, పంచభూతాలూ తన ఇంట ఆప్తులై సంచరిస్తున్నటుగా పదే పదే అనిపిస్తోంది.

ఆమె కాఫీ కలుపుకుందుకు మంచంమీదనుంచి లేచి డ్రాయింగ్ హాలుగుండా వెడుతుంటే కిటికీనుంచి డాబామీదకు పాకిన గులాబీ తీగకు పూసిన చిన్న తెల్ల గులాబీ పువ్వులు కనిపించాయి. ఆమె కిటికీ దగ్గరకు వెళ్లి తీగల్ని, ఆకుల్ని తాకి తన చూపుడు వేలితో పసిపాప చెక్కిలి మీటినట్టుగా తెల్ల గులాబీ పూలను పలకరించింది. పువ్వులు తలలు ఊపుతుంటే మీరాబాయి తలకూడా ఊగింది. ఆమె నిండైన ఆనందంతో వంటింటి గుమ్మం దాటబోతుంటే పక్కనే ఉన్న పెద్ద కుండీలో ఉన్న గులాబీ మొక్కకు పూసిన మల్టీకలర్ పువ్వు శుభోదయం చెబుతూ క్షేమసమాచారాలు అడుగుతున్నట్టు అనిపించి క్షణం ఆగిపోయింది. పరమాత్మ ఆ పువ్వుగా ప్రత్యక్షమై తన దివ్యప్రేమను కానుకగా ఇస్తున్నట్లు అనిపించింది. ఆమె ద్వారబంధంమీద చేయివేసి లోపలికి అడుగు వేయబోతుంటే గుమ్మానికి అటుగా ఉన్న అద్దం కనిపించింది. అనుకోకుండా ఆమె అద్దం ముందు నిలబడింది. అద్దంలో ఆమెకు తన మొహం కనబడింది. అద్దంలో త నెలా ఉంటానో తనకు తెలుసు ననుకున్న మీరాబాయికి ఆమె మొహం ఆమెకే కొత్తగా సరికొత్తగా కనిపించింది. మొహంలో నిండుతనం, ఉజ్జ్వలమైన కాంతి ప్రేమలో పునీతమైన శాంతి కాముకత్వాల కలయిక అయినట్టుగా ఉంది.

ఇంతలో వీథి తలుపు చప్పుడైతే, ఆమె తేరుకుని గొళ్లెం తీసి గుమ్మం ముందు నుంచున్న రాధని చూసి నవ్వుతూ, “రా, రాధా!” అంటూ ఆహ్వానించింది.

“ఎలా ఉన్నారు పిన్నిగారూ? ఊరుకి వెళ్లాను కానీ, దృష్టి అంతా ఇక్కడే ఉండిపోయింది. అందుకే వచ్చేశాను. ఈ రెండు రోజులూ ఎలా గడిపారు?” అంటూ రకరకాలుగా ప్రశ్నించింది రాధ.

“బాగా ఉన్నానమ్మా! అద్భుతంగా ఉన్నాను!’


“అయితే ఇదంతా సుందరానందమూర్తిగారి ఆశీర్వాదం ...” అంటూ రాధ మీరాబాయి మొహంలోకి ఒకటి రెండుసార్లు పరకాయించి చూసింది.

“ఏమిటలా చూస్తున్నావు?”

“మీ రివాళ అచ్చుమచ్చు మహలక్ష్మిలా కనిపిస్తున్నారు... నిజం!”

రాధ హాలంతా పరకాయించి చూసి మూలగా కుండీలో ఉన్న గులాబీ చెట్టుకు పూసిన పువ్వును చూసి, “ఎంతకాలానికి ఈ మొక్క పువ్వు పూసింది! దీని గుణం ఏమిటో తెలుసాండీ! ఇది మనలోని ప్రేమను పరమాత్మకు నివేదిస్తుందిట. అలాగే తిరిగి ఆయననుంచి దివ్యప్రేమను తెచ్చి మనకు అందజేస్తుందట.”

మీరాబాయి నవ్వేసింది. రాధ అలా మాట్లాడుతూనే ఆవిడ కళ్లల్లోకి చూసింది. ఆమెకు మీరాబాయి కళ్లల్లోంచి ఆలోచనలనుంచి, హృదయంనుంచి ఏదో మహత్తరమైన అనురాగం జాలువారుతున్నట్టు అనిపించింది.





# మీరు విమానంలో ప్రయాణిస్తే ...

మనకు తెలియనిచోటికి వెళ్లినప్పుడు, అలవాటు లేని పనులు చేసేటప్పుడు మనం బోలెడంత కంగారుపడిపోతాం. మొదటిసారిగా విమానం ఎక్కాలంటే కాస్త దడగానే ఉంటుంది. మనం తెలియక పొరబాటు చేస్తే చుట్టూ ఉన్న అందరూ మనల్నిచూసి నవ్వుతారనీ, ఎగతాళి చేస్తారనే భయం ఉండనే ఉంటుంది.

అలాంటప్పుడు బారిష్టరుపార్వతీశాన్ని తలుచుకుని హాయిగా నవ్వేసు కోడమే!

మొదటిసారిగా విమానం ఎక్కేవారికి కొన్ని




టిప్స్ ఇవిగో!

* విమానాశ్రయంలో మన సామాన్లను తీసుకెళ్లడానికి ఓ కన్వేయరు బెల్టు ఉంటుంది. పొరపాటున దాని మీద మీరు కూర్చునేరు జాగ్రత్త! మనకి వేరే గేటు ఉంది.

* మీ సామాన్లను మీరు విమానం ఎక్కడానికి కొంచెం ముందుగా గుర్తించమంటారు. గుర్తించాక వాటిని మీరు మోసుకెళ్లక్కర్లేదు. వాటిని వారే విమానంలోకి చేరుస్తారు.

* మిమ్మల్ని 'గేటు' దగ్గరకి వెళ్లమని ఓ ప్రకటన వస్తుంది. అది విని నేరుగా బయటి గేటు దగ్గరకి వెళ్లిపోయేరు జాగ్రత్త! గేటంటే మనం ఎక్కాల్సిన విమానం దగ్గరకి వెళ్లే గేటు.

* ఆ గేటు వద్ద నిల్చుంటే తీసుకెళ్లడాని కో బస్సు వస్తుంది. కంగారుపడి "నేను విమానం టికెట్టు కొన్నాను. బస్సులో ఎందుకెక్కాలి?" అని గాభరా పడకండి!

* ఫ్లైట్‌లో ఎయిర్‌హోస్టెస్ ప్రయాణీకులందరినీ చూసి చిరునవ్వు నవ్వుతుంది. మీ ఒక్కరి కోసమే నవ్వుతోందని పొరపాటు పడేరు జాగ్రత్త! ఎస్.పి. గిల్ స్టైల్‌లో రెచ్చిపోయి అలా వెళ్తున్న ఎయిర్ హోస్టెస్ వెనక ఓ చరుపు చరిచేరు! తరువాత బోలెడు సిగ్గుపడి తలదించుకోవలసి వస్తుంది!

* విమాన ప్రయాణంలో జాగ్రత్తలు, అవసరమైనప్పుడు ఆక్సిజన్ మాస్కు వేసుకునే వనతి, ఫ్లైట్ ఎక్కాక మీకు వివరిస్తారు. కలవరపడకండి.

* మీకు మీ సీటు బెల్టు కనపడటంలేదా? అది మీ సీటు కిందే ఉంటుంది. దానికోసం వెతకబోయి పక్కవారికి కితకితలు పెట్టేరు జాగ్రత్త!

* ఫ్లైట్‌లో భోజనం, లేదా టిఫిన్ అందించినప్పుడు 'దీని ఖరీదెంత?' అని జేబులో చెయ్యిపెట్టకోబోకండి. అక్కడ భోజనం, టిఫిను ఉచితంగా సప్లై చేస్తారు.

* భోజనం చేసేటప్పుడు ఆహార పదార్థాలు చెదిరి మీదపడ్డాయా? మరేం పర్లేదు, అది అందరికీ జరిగేదే!

Ⓟ

---

"పిన్నిగారూ! ..." అని రాధ ఆవిడకు ఎదురుగా కుర్చీ లాక్కుని కూర్చుంది.

"ఏమిటమ్మా?"

"మీ రే అనుభవాలు మూటగట్టుకున్నారు? ఏ అనుభూతులు మీకు వరంగా దొరికాయి? మిమ్మల్ని చూస్తూంటే ..." రాధ మాట్లాడలేక ఆగిపోయింది.

"పరమాత్మ ఎంతో నమ్మకంగా 'నేను నీతో ఉన్నానని' చెప్తున్నట్టుగా ఉంటుంది. ఆయన తాలూకు ప్రేమలో నేను తడిసి ముద్దవుతున్నా ననిపిస్తుంది" అంటూ ఆవిడ రెండు రోజులుగా తన అనుభవాలు చెప్తోంది.

"ఎంత అదృష్టవంతులు మీరు? ఆ భాగ్యం నాకు కూడా కలిగితే ..." రాధ చటుక్కున మీరాబాయి కాళ్లు తాకి కళ్లకు అద్దుకుంది. తన చేతులు రెండూ మీరాబాయి చేతులతో కలిపింది. అంతే! ఆ తర్వాత తన కళ్లు విప్పి మీరాబాయి కళ్లల్లోకి ఒకటి రెండు క్షణాలు చూసింది ... అంతే! అప్పుడు మీరాబాయిలో గూడుకట్టుకుని ఉన్న దివ్యప్రేమ రాధపట్ల ఉన్న ఆప్యాయతతో, అనురాగంతో నెమ్మదిగా కదలడం మొదలుపెట్టింది. ఆపైన అది అడుగడుగునా రాధవైపు, రాధలోకి చొచ్చుకుపోసాగింది. ఆ తర్వాత అది శక్తిగా రూపుదాల్చి, వారిద్దరి నడుమా ఉన్న వారధిని చీల్చింది! ఆ సమయాన మహత్తరమైన, మహోన్నతమైన ప్రేమ, ఏ శాస్త్ర వరిజ్ఞానానికీ అర్థంకాని విధంగా ఇద్దరి మనుషులమధ్య ఇటూ అటుగా, కాలానికి అందనంత వేగంగా తేజస్సుగా యాత్రించసాగింది. కొన్ని నిమిషాలు గడిచాయి. రాధ నోటి వెంట అచేతనంగా 'భగవాన్!' అనే మాట వెలువడింది. ఆ మాటతోపాటే ఆమె లేచి తన్మయత్వంతో మీరాబాయి అక్కున జేరిపోయింది. మీరాబాయి ఆప్యాయంగా రాధ తల నిమిరింది ... వెన్ను తట్టింది ... ఆపైన ఆమె మొహం ఎత్తి ఆమె బుగ్గలమీద ముద్దుల వర్షం కురిపించసాగింది.

సరిగ్గా అప్పుడే రమేశ్ తలుపు తెరుచుకుని లోపలికి వచ్చి ఒకరి కౌగిలిలో ఒకరుగా ఇమిడిపోయిన రాధనీ, మీరాబాయినీ చూసి మొదట ఆశ్చర్యపోయాడు. ఆ తరువాత అతనిలో కోపం రేగింది. అది ఆవేశంగా మారింది.

"మీకు బుద్ధుందా? ఏమిటిది? రాధా! ఇటు రా!" అంటూ గబగబా ముందుకు వెళ్లి రాధను మీరాబాయి నుంచి వేరు చేయాలని చూశాడు. కాస్త అవస్థపడ్డాడు. రాధ అచేతనంగా అతనివైపు చూసి ఆ తర్వాత మృదుమధురంగా, ప్రేమమూర్తిలా నవ్వింది.

"మీరు పెద్దవారు ... నా భార్యను ఇలా క్షుద్రవిద్యలతో లొంగదీసుకుంటారా? ... మీరసలు ..." అంటూ ఏదో అనబోయి మీరాబాయి కళ్లల్లోకీ, రాధ కళ్లల్లోకీ చూశాడు.

రమేశ్ గొంతుకనుంచి వాడిగా వేడిగా వచ్చే మాటలకు ఆనకట్ట పడింది. అతని ఆలోచనలన్నీ క్రమమార్గంలోకి వస్తూ, అవి చైతన్యవంత మవుతూ, ఆపైన ప్రకాశమానమవుతూ, సరికొత్త తలుపులు తెరుస్తూ హృదయానందాన్ని కలగజేయసాగాయి. రమేశ్‌కు తను ఏదో అవుతున్నట్టు, కొత్త మనిషిగా మారుతున్నట్టు తెలుస్తోంది. ఓ గొప్ప ప్రేమ తాలూకు అనుభవం ఎంత గొప్పదిగా ఉంటుందో అతనికా క్షణాన తెలిసివస్తోంది. మీరాబాయికీ, రాధకు తెలియకుండా దొంగచాటుగా వెళ్లి విన్న సుందరానందమూర్తిగారు ఉపన్యాసం అతనికి చటుక్కున గుర్తొచ్చింది ... డివైన్ లవ్ అంటే - అతనికి అప్పుడు ఎలా ఉంటుందో తెలియరాసాగింది!

Ⓟ